సాక్షి
నిర్మల్

బుధవారం, 15, అక్టోబర్, 2025





**ఆత్మీయం.. ఆదివాసీ వైభవం**
ఆదివాసీ గూడేల్లో అంగరంగ వైభవంగా సాగే దండారీ సంబరం మొదలైంది. డప్పుల దరువులు, గజ్జెల మోతలు, గుస్సాడీ నృత్యాలతో అడవితల్లి మురిసి పోనుంది. IIలో▸



**'సర్కారు' విద్యార్థులకు కష్టాలు**
సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పిస్తామని పాలకులు, అధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం వారి మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. IIIలో▸

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం
30.1 /23.1
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### క్రీడల్లోనూ రాణించాలి
- డీఈవో భోజన్న



విజేతలతో నిర్వాహకులు

నిర్మల్ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో భోజన్న అన్నారు. జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ అండర్–14, 17 బాల బాలికలకు ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. డీఈవో పోటీలను ప్రారంభించారు. 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు టీషర్టులు అందజేశారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రీనివాస్, పీఈటీలు అంబాజీ, రాముగౌడ్ పాల్గొన్నారు.

**జోనల్‌స్థాయికి ఎంపికైన క్రీడాకారులు..**

**అండర్ 14 బాలికలు..**
ఆరాధ్య, అద్విత, అన్వితశ్రీ(వాసవి పాఠశాల), హర్షిత(శ్రీచైతన్య), లాస్య(నారాయణ భైంసా)

**అండర్ 14 బాలురు..**
అర్జున్, శివదీప్, అద్విత్(విజయ హైస్కూల్), జషిత్(శ్రీచైతన్య), లవ్‌కుమార్(నారాయణ భైంసా)

**అండర్ 17 బాలికలు..**
ప్రతిభ (విజయ హైస్కూల్), అక్షర, అవని పటేల్, సహస్ర(వాసవి), భక్తి(అల్ఫోర్స్)

**అండర్ 17 బాలురు..**
సోహాన్, ఇమాద్, సాయి సంస్కార్, సంపత్ రెడ్డి (విన్నర్స్ హైస్కూల్), విగ్నేష్ (నారాయణ హైస్కూల్)

### మెప్మాలో నిధుల దుర్వినియోగం

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని మెప్మా విభాగంలో రిసోర్స్ పర్సన్(ఆర్పీ)గా విధులు నిర్వహిస్తున్న షైరాభాను నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని స్వయం సహాయక సభ్యుల నుంచి వసూలు చేసిన రుణాలను బ్యాంకులో జమ చేయకుండా వ్యక్తిగత, కుటుంబ ప్రయోజనాలకు వాడుకున్నట్లు స్వయం సహాయక సభ్యులు, బ్యాంకు అధికారులు గతంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన మున్సిపల్ అధికారులు నిధుల దుర్వినియోగం వాస్తవమేనని నిర్ధారించారు. దీంతో ఆమెను విధుల నుంచి తప్పించారు.

### నకిలీలపై చర్య తీసుకోవాలి
- ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్

తానూరు: తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి జూనియర్ లెక్చరర్లుగా రాష్ట్రవ్యాప్తంగా 700 మంది క్రమబద్ధీకరణ పొందారని, వారిపై చర్య తీసుకోవాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు భూమన్న యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఆర్జేడీ నేతృత్వంలోని కమిటీ ధ్రువీకరించిందని తెలిపారు. జీవో నంబర్ 16 ప్రకారం 2014లో మంజూరైన పోస్టుల్లో కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న వారిని 14 ఏళ్లు వరుసగా సర్వీస్ ఉన్న వారిని మాత్రమే క్రమబద్ధీకరించాలని తెలిపారు. అందుకు విరుద్ధంగా మధ్యలో సర్వీస్ బ్రేక్ అయిన వారిని కూడా క్రమబద్ధీకరించినట్లు కమిటీ గుర్తించిందని పేర్కొన్నారు. వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారిస్థానంలో అర్హులైన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

### డిగ్రీ ప్రవేశాల గడువు పెంపు

నిర్మల్ రూరల్: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రస్తుత విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ గంగాధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం ప్రవేశాలతోపాటు, ద్వితీయ సంవత్సరం, తృతీయ సంవత్సరం అడ్మిషన్లకు ఇదే గడువు వర్తిస్తుందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 73829 29703 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ముథోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్ల గురించి వివరించారు. కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# పగ్గాలు ఎవరి చేతికో..?

- డీసీసీ 'పీఠం' కోసం పోటాపోటీ
- 22 మంది ఆశావహులు
- రెండురోజులు జిల్లాలో పర్యటించిన పరిశీలన కమిటీ
- సీనియర్లు, జూనియర్లు నిబంధనతోనే పరేషాన్



నిర్మల్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీలో డీసీసీ పీఠం హాట్‌సీట్‌లా మారింది. జిల్లా అధ్యక్ష స్థానం కోసం ఎవరికి వారు సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీని జిల్లాలో బలో పేతం చేస్తూ ముందుండి నడిపే నాయకుడిని ఎన్నుకునే క్రమంలో ఏఐసీసీ పరిశీలన కమిటీ రెండురోజులు పర్యటించింది. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో కమిటీ పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకుంది. కమిటీ నివేదికలతోపాటు పెద్దల ఆశీస్సులతో డీసీసీ పీఠం ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. మొత్తం 22 మంది డీసీసీ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్న నిబంధనలు దరఖాస్తుదారులను టెన్షన్ పెడుతున్నాయి.

**పోటీలో 22 మంది..**

కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్ష స్థానం కోసం మొత్తం 22 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్‌అలీ, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుతోపాటు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, అల్లూరి కృష్ణవేణి, కె.నవీన్‌రెడ్డి, కె.విలాస్‌రావు, ఓ.నారాయణరెడ్డి, ఎంఏ.లతీఫ్, మహ్మద్ మొయినొద్దీన్, అల్మాస్‌ఖాన్, దొనికెన దయానంద్, రాజూర సత్యం, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, దాసరి రాజన్న, అన్ముల భాస్కర్, నీరటి సుదర్శన్, దశరథ్ రాజేశ్వర్, గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, మహ్మద్ అతీఖ్‌అహ్మద్, ముడుసు సత్యనారాయణ, ఎంబడి రాజేశ్వర్ దరఖాస్తుదారుల జాబితాలో ఉన్నారు. వీరంతా తమకే డీసీసీ అధ్యక్ష పదవి ఎందుకు ఇవ్వాలన్న విషయాన్ని ఏఐసీసీ పరిశీలన కమిటీ దృష్టికి తీసుకెళ్లారు.

**నిబంధనలతో పరేషాన్..**

దరఖాస్తు చేసుకోవడం, పరిశీలన కమిటీల పర్యటన పూర్తికావడంతో ఇక డీసీసీ అధ్యక్షులను ప్రకటించడమే ఆలస్యం అనుకుంటున్న తరుణంలో ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. ఇందుకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జూమ్ మీటింగ్‌లో చెప్పిన నిబంధనలే కారణం. ప్రస్తుతం ఉన్న డీసీసీ అధ్యక్షులకు మళ్లీ అవకాశం ఉండదని, అలాగే ఐదేళ్లపాటు పార్టీలో సీనియారిటీ ఉన్నవారికే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇవి రెండూ ప్రస్తుతం ఉన్న ఆశావహుల్లో చాలామందికి ఇబ్బందిగా మారనున్నాయి. ఈనేపథ్యంలో డీసీసీ పీఠం ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది.

**ఎవరి పైరవీలు వారివే..**

కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున ఆ పార్టీ జిల్లా అధ్యక్ష స్థానానికి డిమాండ్ ఏర్పడింది. చాలామంది సీనియర్లతోపాటు పలువురు జూనియర్లు సైతం తమకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. పీఠం కోసం పైరవీలు మొదలు పెట్టారు. రెండేళ్లుగా కూచాడి శ్రీహరిరావు డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి మరోసారి తనకే అవకాశం ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అన్నీ కలిసివస్తే మళ్లీ కూచాడికే డీసీసీ పగ్గాలు అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఉన్న అర్జుమంద్‌అలీ ఎన్నికలకు ముందునుంచే పార్టీలో ఉన్నారు. ఆయన నాయకత్వంలోనే ప్రస్తుతం ఉన్న నేతలు పార్టీలో చేర్చానని చెబుతున్నారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో భాగంగా తనకు అవకాశమివ్వాలని కోరుతున్నారు. సీనియర్లుగా ఉన్న దొనికెని దయానంద్, రాజూరసత్యం, ఆనంద్ రావు, లతీఫ్, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, దశరథ్ రాజేశ్వర్, గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, నీరటి సుదర్శన్, అతీఖ్‌అహ్మద్, ముడుసు సత్యనారాయణ, పీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఉన్న ఎంబడి రాజేశ్వర్ తదితరులూ డీసీసీ పీఠాన్ని ఆశిస్తున్నారు. దరఖాస్తుదారుల్లో మహిళానేత ఒక్కరే ఉండటం గమనార్హం. సీనియర్‌నేతగా గుర్తింపు ఉన్న అడ్వకేట్ అల్లూరి మల్లారెడ్డి కుమార్తె అల్లూరి కృష్ణవేణి డీసీసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

# 'బెస్ట్' విద్యార్థులు నష్టపోవద్దు

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో విద్యార్థుల విద్యా బోధనలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా, అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లుభట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పరిస్థితులపై హైదరాబాదులో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భట్టి మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. విద్యార్థుల విద్యా బోధనలో ఏ విధమైన ఆటంకాలు లేకుండా చూడాలని తెలిపారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలతో సమన్వయం కలిగి విద్యార్థుల ప్రయోజనాలు కాపాడాలన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, బడుగు బలహీన వర్గాల పిల్లలకు మౌలిక వసతులతో విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**మెరుగైన విద్యా బోధనకు చర్యలు..**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఈ పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో భోజన్న, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల అధికారులు దయానంద్, అంబాజీ, మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

# ప్రజాక్షేత్రంలో ఉన్నవారికే పదవులు

- ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు అజయ్‌సింగ్



మాట్లాడుతున్న అజయ్‌సింగ్

భైంసాటౌన్: నిత్యం ప్రజల్లో ఉంటూ, పార్టీ కోసం పనిచేసేవారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని ఏఐసీసీ జిల్లా పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్యే అజయ్‌సింగ్ అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడి ఎన్నికపై పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం, తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్‌తోనే సాధ్యమయ్యాయన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక ప్రస్తావిస్తూ.. ప్రజలకు సేవ చేసే నాయకులకు గుర్తింపు ఉంటుందని, పార్టీ పదవులు కట్టబెడుతుందన్నారు.

**మచ్చ లేనివారినే ఎన్నుకోండి...**

ఎలాంటి అవినీతి మచ్చ లేనివారినే డీసీసీ నూతన అధ్యక్ష పదవికి ఎంపిక చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ అజయ్‌సింగ్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు రాజకీయాన్ని దందాగా మార్చుకుంటున్నారని వేదికపై ఉన్న మాజీ ప్రజాప్రతినిధిని ఉద్దేశించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడ్డారని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎవరైనా అవినీతికి పాల్పడితే జైలు పాలవుతారంటూ హెచ్చరించారు. పార్టీకి చెడ్డ పేరు రాకుండా డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకోవాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, కోఆర్డినేటర్ జితేందర్, టీపీసీసీ పరిశీలకులు రాంభూపాల్, ధనపతి, వేణుగోపాలచారి, ఇంద్రకరణ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# రైతుల పాదయాత్ర షురూ..

- బాసర నుంచి ప్రారంభం
- ముథోల్ చేరుకున్న రైతుల బృందం..
- నేడు భైంసా సబ్ కలెక్టర్‌కు వినతి



పాదయాత్రలో కిసాన్‌సంఘ్ నేతలు, రైతులు

భైంసా: జిల్లాలో సోయా కొనుగోలు కేంద్రాల ప్రారంభించాలని కోరుతూ భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం పాదయాత్ర ప్రారంభించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి రైతులతో కలిసి బాసర సరస్వతీ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పాదయాత్రగా కదులుతూ రోడ్డు పక్కనే కుప్పలుగా వేసిన సోయా కల్లాలపై వెళ్లి రైతులతో మాట్లాడారు. పంట కోసి నెలరోజులైనా కేంద్రాలు తెరవలేదని కురుస్తున్న వర్షాలతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోయా రైతులను ఓదారుస్తూ పాదయాత్ర లో ముందుకు వెళ్లారు. బిద్రెల్లి టాక్లి ముథోల్ పంట శివారులో భారీ వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లా వ్యవసాయ అధికారులు పంట క్షేత్రాలు పరిశీలించిన ఇప్పటివరకు పరిహారం ఇప్పించలేకపోయారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**కొనుగోలు కేంద్రాలు కరువు..**

కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోరుతూ, భారీ వర్షంతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర ప్రారంభించినట్లు భారతీయ కిసాన్ సంఘ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం ప్రైవేట్ మాఫియాను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. పంటలు కోయడానికి కూలీల కొరత తీవ్రంగా ఉందని ఇప్పటికే రేటు లేక రైతులు ఇబ్బంది పడుతుండగా, కొనుగోలు కేంద్రాలు లేకపోవడం మరింత భారమైందని పాదయాత్రలో రైతులు చెబుతున్నారు.

**నేడు సబ్ కలెక్టర్‌కు వినతి**

బాసర నుంచి ప్రారంభమైన యాత్ర ముథోల్‌కు చేరుకుంది. రెండోరోజు బుధవారం భైంసా వరకు కొనసాగనుంది. సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం ఇవ్వనున్నారు. సోయా పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని, భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని నాయకులు కోరనున్నారు.

# పత్తి కొనుగోళ్లు ఆలస్యం

- ఇప్పటికీ ఖరారు కాని ప్రణాళిక
- కపాస్ కిసాన్ యాప్‌లో బుకింగ్
- సీసీఐలోనే మద్దతు ధర



విక్రయానికి తీసుకువచ్చిన పత్తి(ఫైల్)

భైంసా/భైంసారూరల్: దసరా పండుగ దాటినా జిల్లాలో పత్తి కొనుగోళ్లపై స్పష్టత కరువైంది. కేంద్రాల ఏర్పాటు ప్రణాళికే ఖరారు కానట్లు తెలుస్తోంది. దీంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. సాధారణంగా పత్తి పంట దసరా సమయానికి రైతుల చేతికి వస్తుంది. రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తారు. ఏటా కొనుగోళ్ల జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారు. ఈసారైనా సమయానికి కేంద్రాలు తెరవాలని రైతులు కోరుతున్నారు. నిర్మల్, సారంగాపూర్, ఖానాపూర్, కుభీర్, భైంసా ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్క కేంద్రం కూడా ప్రారంభం కాలేదు.

**సీసీఐలోనే మద్దతు**

పత్తి పంటకు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర దక్కుతుంది. ప్రైవేటుగా అమ్మితే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రైవేటు వ్యాపారులు రంగంలోకి దగక ముందే సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ప్రైవేటుగా విక్రయిస్తే పెట్టుబడి కూడా రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

రైతులు పత్తి విక్రయానికి ముందుగా ఆన్‌లైన్ ఆధార్ ధ్రువీకరణతో సంబంధిత కేంద్రాల్లో రిజిస్టర్ కావాల్సిందేనని అధికారులు సూచిస్తున్నారు. పత్తి విక్రయించి వచ్చే మొత్తాన్ని రైతుల ఆధార్ లింక్ బ్యాంక్ ఖాతాల్లోనే డిపాజిట్ చేస్తారు.

**యాప్‌లో స్లాట్ బుకింగ్**

సీసీఐ తాజా సంవిధానంగా 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఏఈవోలు సేకరించిన వ్యవసాయ వివరాలు వ్యవసాయ పోర్టల్‌కు అనుసంధానించబడ్డాయి. రైతులు తమ సెల్ ఫోన్ నంబర్‌తో యాప్‌లో నమోదు చేసుకుంటే, జిన్నింగ్ మిల్, పత్తి అమ్మే తేదీ కేటాయించబడుతుంది. అవగాహన లేని వారు తమ క్లస్టరు ఏఈవో ద్వారా కూడా నమోదు చేయవచ్చు.

**మద్దతు ధర ఇలా..**

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో కొనుగోలుకు మద్దతు ధర ప్రకటించింది. పత్తి తేమ శాతం ఆధారంగా ధరలు ఉంటాయి.

- 8% తేమకు రూ.8,110
- 9% తేమకు రూ.8,028.90
- 10% తేమకు రూ.7,947.80
- 11% తేమకు రూ.7,866.70
- 12% తేమకు రూ.7,785.60

12% తేమ శాతానికి మించి ఉన్నా, నాణ్యత లేదా వర్షానికి తడిసిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదు.

**త్వరలోనే కొనుగోళ్లు**

"భైంసా మార్కెట్‌లో త్వరలోనే పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. జిల్లాలో భైంసాలోనే అత్యధిక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించాం. రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించకుండా నేరుగా సీసీఐ కేంద్రాలకే పంట తీసుకురావాలి. ఈయేడు క్వింటాల్ పత్తికి ప్రభుత్వం రూ.8110గా మద్దతు ధర నిర్ణయించింది."
– ఆనంద్‌రావుపటేల్, ఏఎంసీ చైర్మన్

# దేశ అభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

- డీఈవో భోజన్న



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో డీఈవో

నిర్మల్ రూరల్: దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో దేశాలకు మార్గదర్శకంగా ఉందని, దేశం వేగంగా అభివృద్ధి చెందడంలో సైన్స్ పాత్ర చాలా కీలకమని డీఈవో భోజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని జేవీఎస్‌ఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 'సౌత్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్టివల్'లో మాట్లాడారు. విద్యార్థులు ఆవిష్కరణలు చేసే దిశగా చిన్నప్పటినుంచే ప్రయత్నించాలన్నారు. వ్యవసాయ రంగంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర పెరగడంతో పంటల దిగుబడి పెరుగుతోందన్నారు. 'మానవ అభివృద్ధి కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర 'అనే ప్రధాన అంశంతో నిర్వహించిన ఈ డ్రామా ఫెస్టివల్‌లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 20 డ్రామాలతో 180 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్మార్ట్ వ్యవసాయం, డిజిటల్ ఇండియా, ఆరోగ్యం– పరిశుభ్రత, గ్రీన్ టెక్నాలజీ అనే అంశాలతో విద్యార్థులు చేసిన డ్రామాలు మెప్పించాయి. జ్యూరీ మెంబర్లుగా సంపత్‌కుమార్, నాగరాజు, రఫీ వ్యవహరించా రు. ఇందులో తెలంగాణ మోడల్ స్కూల్ కుంటాల కు చెందిన కార్తికేయ, దివ్య, నాగజ్యోతి, గనుశ్రీ, స్వప్న, విశాల్ జస్వంత్ విద్యార్థులు విజయం సాధించారు. రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, సైన్స్‌టీం సభ్యులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లకు చర్యలు చేపట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంటల కొనుగోలు ప్రక్రియపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. పత్తి కొనుగోళ్లు నిర్ణీత సమయానికి పూర్తి చేయాలన్నారు. కొనుగోళ్లకు సంబంధించి ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ కోసం 'కపాస్ కిసాన్ యాప్' వినియోగించాలన్నారు. రైతులకు యాప్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతు వేదికల ద్వారా, గ్రామాల్లో ఏవోలు, ఏఈవోలు రైతులకు ఈ యాప్ గురించి వివరించాలన్నారు. రైతులు పత్తి కొనుగోలు సంబంధిత సేవల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800–599–5779 లేదా వాట్సాప్ నంబర్ 8897281111 ను సంప్రదించి సమాచారం పొందాలని తెలిపారు. పంటలకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. వే బ్రిడ్జిల నిర్వాహకులు నిర్ణీత గడువులోపే స్టాంపింగ్ చేయించుకోవాలన్నారు. రైతులు పంటలు అమ్మిన తర్వాత నిర్ణీత గడువులోపు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోళ్లలో కూడా జాప్యం చేయవద్దన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు సంబంధించిన 'కపాస్ కిసాన్' యాప్ గోడప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, మార్కెటింగ్ అధికారి గజానంద్, ఆర్డీవో రత్నకళ్యాణి, మార్క్‌ఫెడ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి

ఖానాపూర్: ఆశ వర్కర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జయలక్ష్మి అన్నారు. మండలంలోని మస్కాపూర్‌లో యూనియన్ మూడో జిల్లా మహాసభ మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. కేంద్రం ఆశ వర్కర్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కనీస వేతనం రూ.26 వేలతోపాటు అర్హతను బట్టి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి సభా వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి కార్యక్రమం ప్రారంభించారు.

### మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తాం

లోకేశ్వరం: వ్యవసాయానికి, గృహావసరాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు 5 ఎంవీఏను ఏర్పాటు చేశామని జిల్లా విద్యుత్ అధికారి సాలియా నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా 5 ఎంవీఏ పవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించగా, సాలియా నాయక్ ప్రారంభించారు. మండలంలో పేరుకుపోయిన విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నారు. విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్టీ డీఈ చారిచంద్, ఎంఆర్టీ ఏడీఈ రమేశ్, బాసర ఇన్‌చార్జి ఏడీఈ ప్రదీప్, లోకేశ్వరం విద్యుత్ ఏఈ శివకుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# 17 నుంచి ప్రతిష్టాపనోత్సవాలు

- హాజరు కానున్న విధుశేఖరభారతి
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ధనపాల్ సూర్యనారాయణ

బాసర: బాసరలోని శ్రీలలితా చంద్రమౌళీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల ఆహ్వాన పత్రికను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మంగళవారం బాసరలో ఆవిష్కరించారు. కుంభాభిషేక మహోత్సవాలకు జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ఈ పండుగ సందర్భంగా ప్రత్యేక వేద పాఠశాలను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి యత్నిస్తున్నట్లు తెలిపారు. అంకురార్పణ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని వెల్లడించారు.

**ఆలయ అభివృద్ధికి కార్యక్రమాలు**

భవిష్యత్ ఆలయ అభివృద్ధిలో భాగంగా 108 లింగాలు, 12 జ్యోతిర్ లింగాలు, 8 ఫీట్ల ఎత్తైన నంది విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు పెద్దకొండ్రు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సతీశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు ముత్యం సంతోష్, హరిప్రసాద్, చింత రాజు, కొమ్ము సుధాక్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

**బజార్‌హత్నూర్:** బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఒకరిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. నేరడిగొండ మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన చందనగిరి కిష్టయ్య (50) సోమవారం బజార్‌హత్నూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. రోడ్డుపై ఆడుకుంటున్న బాలిక (9)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపారు.

### ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు

**ఆదిలాబాద్‌టౌన్:** మద్యం మత్తులో ఆటో నడిపి ఒకరి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.7,500 జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపారు. జైనథ్ మండలానికి చెందిన జక్కులవార్ రీకేష్ 2024 ఏప్రిల్ 6న ఆదిలాబాద్ నుంచి జైనథ్ వైపు మద్యం మత్తులో ఆటోలో వెళ్తుండగా తర్నం బ్రిడ్జి సమీపంలో ఆటో బోల్తా పడింది. అదే మండలానికి చెందిన ఇప్ప భరత్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, మిగితా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా అప్పటి సీఐ డి.సాయినాథ్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి ఎంఏ జమీర్ 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ రహీమ్ నేరం రుజువు చేయడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు వివరించారు.

### ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

**భీమారం:** గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు భీమారం మండల కేంద్రంలోని గోపు రాజయ్య బిల్డింగ్ వద్ద గంజాయి విక్రయిస్తున్న దుర్గం సంజయ్ (తాళ్లగూడెం, భీమారం), సెగ్యం విజయ్‌కుమార్ (సుంకరిపల్లి, భీమారం), పోలవేని రాజేందర్ (కొత్తగుడిసెలు, భీమారం), కుక్కల అరివింద్ (కక్కెరగుంట, రామడుగు), అనెమోలు శేఖర్ (కక్కెరగుంట, రామడుగు) పట్టుకుని వారి వద్ద నుంచి 350 గ్రాముల గంజాయి, కారు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

### పాఠశాల ఆవరణలో నాగుపాము కలకలం



పామును బంధిస్తున్న స్నేక్‌క్యాచర్ అనిల్

**నిర్మల్‌ఖిల్లా:** జిల్లా కేంద్రంలోని వెంకటపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నాగుపాము కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం ఇంటర్వెల్ సమయంలో మూత్రశాలల సమీపంలో నాగుపామును గమనించిన విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులతో చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని శాంతినగర్ కాలనీకి చెందిన స్నేక్‌క్యాచర్ గిరిగంటి అనిల్‌కు సమాచారం అందించడంతో చాకచక్యంగా పామును బంధించి అటవీప్రాంతంలో వదిలిపెట్టాడు. ఈ సందర్భంగా స్నేక్‌క్యాచర్ అనిల్‌ను అభినందించారు.



# ఆత్మీయం.. ఆదివాసీ వైభవం



దండేపల్లి మండలం గుడిరేవులోని ఏత్మాసార్ పేన్ పద్మల్‌పురి కాకో ఆలయం



దండేపల్లి మండలం గుడిరేవులోని ఏత్మాసూర్ పద్మల్‌పురి కాకో అమ్మవారు

- గూడేల్లో మొదలైన దండారీ సందడి
- ఆరాధ్య దైవానికి ప్రత్యేక పూజలు
- అడవి బిడ్డల గుండెల్లో ఆనందోత్సాహాలు...

ఆదివాసీ గూడేల్లో అంగరంగ వైభవంగా సాగే దండారీ సంబరం మొదలైంది. డప్పుల దరువులు, గజ్జెల మోతలు, గుస్సాడీ నృత్యాలతో అడవితల్లి మురిసి పోనుంది. ఆదివాసీల ఆరాధ్య దేవత 'ఏత్మాసార్ పేన్' పేరిట చేసే ప్రత్యేక పూజలతో దండారీ పండుగ ప్రారంభమైంది. దీపావళికి ముందు అశ్వయుజ పౌర్ణమి మరుసటి రోజు భోగితో ప్రారంభమై కొలబొడితో ముగియనుంది. పక్షం రోజుల పాటు కొనసాగే ఉత్సవాలకు గూడేలన్నీ సిద్ధమవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం దండారీని ప్రత్యేక పండుగగా గుర్తించింది.

– బజార్‌హత్నూర్



గుస్సాడీ టోపీ తయారు చేస్తున్న గిరిజనుడు



గుస్సాడీ వేషధారణలో డెంసా నృత్యం చేస్తున్న ఆదివాసీలు (ఫైల్)

గుస్సాడీలు అశ్వయుజ పౌర్ణమి మరుసటి రోజు భోగితో మాలధారణ చేసి పది రోజుల పాటు కఠిన దీక్ష చేపడతారు. దీక్ష పూర్తయ్యే వరకు స్నానం ఆచరించరు. ఒంటిపై చుక్క నీరుకూడా పడకుండా.. కాళ్లకు చెప్పులు ధరించకుండా.. ఒంటిపై ఎలాంటి వస్త్రాన్ని కప్పుకోకుండా అర్ధనగ్నంగానే గడుపుతారు. నేలపైనే కూర్చోవడం, నేలపైనే పడుకోవడం వారి ఆచారం. గుస్సాడీల్లో పోరీలది మరింత ప్రాముఖ్యత. స్త్రీ వేషధారణలో ఉండే యువకులను ఆదివాసీలు పోరీలు అని పిలుస్తారు. వారు ఏ ఊరికి వెళ్లినా.. ఏ ఇంటిని సందర్శించినా మహిళలు మంగళహారతులు ఇచ్చి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంటారు.

**ఆరాధ్యదైవం ఏత్మాసార్ పద్మల్‌పురి కాకో**

ఆదివాసీలకు పెద్ద పండుగ దీపావళి.. ఇందులో భాగంగానే గోండులకు ఆరాధ్యదైవమైన ఏత్మాసార్ పద్మల్‌పురి కాకో ఆలయానికి భక్తజన దండు కదులుతుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి తీరంలో కొలువై ఉన్న పద్మల్ పురి కాకో ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల నుంచి ఆదివాసీలు అధికసంఖ్యలో తరలివస్తారు. గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరిస్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకుంటారు.

**గుస్సాడీ టోపీ ప్రత్యేకం**

గుస్సాడీ టోపీలను నిపుణులైన గోండులు, కొలాంలు తయారు చేస్తారు. నెమలి ఈకలను సేకరించి వాటి తెల్లని కాడలను అల్లికగా మెలివేసి తలకు పట్టే ఒక చిన్న వెదురు బుట్ట అంచు చుట్టూ గట్టిగా కుట్టేసి, నెమలి పింఛాలు పై వైపు అందంగా బయటకు గుండ్రని బుట్టలాగా విస్తరిస్తూ, కదిలినప్పుడు విలాసంగా ఊగేలా ఏర్పాటు చేస్తారు. టోపీకి చుట్టూ ముఖ్యంగా ముందు వైపు, పలు వరుసల్లో, పెద్ద అద్దాలతో, రంగురంగుల జరీ దారాలు, చక్కటి డిజైన్లు ఉన్న గుడ్డపట్టీలతో, పలు ఆకారాల రంగురంగుల చెమ్కీ బిళ్లలు, చిన్ని గంటల మాలలతో, కొన్నిసార్లు రెండు వైపులా జింక కొమ్ములతోనూ అలంకరిస్తారు.

**ఆదివాసీల మధ్య ఆత్మీయ బంధం**

దండారీ అంటేనే ఐకమత్యానికి నిదర్శనం. ఈ పండుగ వేళ ఆదివాసీ గ్రామాల గిరిజనం ఒక ఊరి నుంచి మరో ఊరికి విడిది వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. రాత్రంతా నృత్యం చేస్తూ రేలారె రేలా పాటలతో పాటు గోండి హాస్యపు నాటికలు ప్రదర్శించి వినోదాన్ని అందిస్తారు. తెల్లవారుజామునే కాలకృత్యాలు తీర్చుకుని మాన్‌కోలాతో నృత్య ప్రదర్శనలు చేసి సాయంత్రం సార్‌కోలాతో ముగిస్తారు. ఈ సందర్భంగా ఆదివాసీలు అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేసి వీడ్కోలు పలుకుతారు. అలా చేయడం ద్వారా రెండు గ్రామాల మధ్య సత్సంబంధాలు, బాంధవ్యాలు పెరుగుతాయని ఆదివాసీ పటేళ్లు పేర్కొంటున్నారు.

**నాలుగు సగల పేరిట ఉత్సవాలు**

దండారీ పండుగలో ఏత్మాసార్ పేన్ పేరిట గిరిజనులు నాలుగు సగ(గోత్రం)లలో ఉత్సవాలు జరుపుకుంటారు. నాలుగు సగల అంటే గుమ్మేల, ఐదు సగల వారు అంటే ఫర్ర, ఆరు సగల వారు అంటే కోడల్, ఏడు సగల వారు అంటే తపల్ పేరిట ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. వేడుకల్లో భేటికోలా, మాన్‌కోలా, సదర్‌కోలా, కోడల్‌కోలా, సార్‌కోలా, కలివల్‌కోలా నృత్యాలు చేయడం ఆదివాసీలకే సొంతం. పేర్లు ఎంత వైవిధ్యంగా ఉన్నాయో వారి ఆటపాటలు కూడా అంతే వైవిధ్యంగా సాగుతాయి. చచోయ్ ఇట్ కోలారా.. దేనే దేనారా.. రేలా.. రేలా.. లాంటి ఆట పాటల నడుమ ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగుతాయి.

**కొలబొడితో ముగింపు**

దీపావళి రెండు రోజుల తరువాత గురువారం కొలబొడితో ఈ దండారీ వేడుకలు ముగుస్తాయి. ఈ సందర్భంగా దండారీ బృందం ఇంటింటికీ వెళ్లగా గృహిణి ఓ పళ్లెంలో ధాన్యాలు, తోచినంత నగదు ఉంచిన హారతిని వారికి అందిస్తుంది. దానిని వారు సంతోషంగా స్వీకరించి ఇంట్లో అందరూ బాగుండాలని, పాడిపంటలు సమృద్ధిగా పెంపొందాలని ఆశీర్వదిస్తారు. అనంతరం పాటలు పాడుతూ హారతి పూజ ఇస్తారు. అనంతరం గ్రామ పొలిమేరలో ఉన్న ఇప్పచెట్టు వద్ద తమ ఇలవేల్పు అయిన భీందేవుని సన్నిధికి చేరుకుంటారు. తలకు ధరించిన నెమలి టోపీలను తొలగిస్తారు. గుస్సాడీ వేషధారణ, అలంకరణ వస్తువులను భీందేవుని సన్నిధిలో పెట్టి కోళ్ళు, మేకలను బలి ఇస్తారు. భీం దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం విందు భోజనాలతో కొలబొడి నిర్వహించి కార్యక్రమాన్ని ముగిస్తారు.



వాయిద్యాలను సిద్ధం చేస్తున్న ఆదివాసీ గిరిజనుడు

### నువ్వుల నూనెతో పూజలు



నువ్వుల నూనె తయారు చేస్తున్న ఆదివాసీలు

గిరిజన గ్రామాల్లోని ప్రతీ ఇంట్లో దీపావళి సందర్భంగా మహిళలు ఉపవాస దీక్ష చేస్తారు. నువ్వులను రోలులో వేసి దంచి నూనె తీస్తారు. ఆ నూనెతో దండారీ ఉత్సవాలు ముగిసే వరకు దీపాలు వెలిగించి పూజలు చేస్తారు.



రేలా రె రేలా పాటలకు నృత్యం చేస్తున్న ఆదివాసీ మహిళలు (ఫైల్)

### భోగి పూజలు



భోగి పూజలు చేస్తున్న ఆదివాసీలు

**ఇంద్రవెల్లి:** మండలంలోని పిప్రి లక్కుగూడ, తుమ్మగూడ గ్రామాల్లో మంగళవారం భోగి పూజలు నిర్వహించి దండారీ ఉత్సవాలు ప్రారంభించారు. ఏత్మసార్ దేవతకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

### పవిత్రమైన పండుగ



మా ఆదివాసీ గోండు గిరిజనులకు దీపావళి పవిత్రమైన పండుగ. ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకుంటాం. గిరిజన దేవతలను, వన దేవతలను పూజిస్తాం. బంధువుల ఇళ్లకు వెళ్తాం. గుస్సాడీల థింసా నృత్యం, ఆడపడుచుల రేలారేరేలా నృత్యం ఆకట్టుకుంటాయి.

– కొడప భీంరావ్ పటేల్, చింతలసాంగ్వీ

### ఘనంగా జరుపుకుంటాం



దీపావళికి పక్షం రోజుల ముందే అన్నీ సిద్ధం చేసుకుంటాం. ఎంత పేద గిరిజనుడైనా ఈ పండుగకు ఇంటిని శుభ్రపరచడం, కొత్త బట్టలు కొనుక్కోవడం, పిండివంటలకు సామగ్రి సమకూర్చుకుంటారు. నెమలి ఈకలతో టోపీలు తయారు చేసుకుంటాం. దండారీ ఘనంగా జరుపుకుంటాం.

– కనక లంకు మహాజన్, తుమ్మగూడ, ఇంద్రవెల్లి

### ప్రోత్సాహం అందించాలి



ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గత సంవత్సరం రూ.15 వేలు అందించింది. ఈ సంవత్సరం కూడా ప్రోత్సాహకం అందించాలని జిల్లా సార్‌మేడీలు, కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి విన్నవించాం.

– మేస్రం దుర్గు, జిల్లా సార్‌మేడి, ఉట్నూర్

# కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



కల్పన (ఫైల్)

**తిర్యాణి:** కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన కల్పన (28)కు తిర్యాణి మండలంలోని గంభీరావుపేటకు చెందిన సైదం శేఖర్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో కల్పన పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించడంతో ఇటీవల మళ్లీ అత్తారింటికి వచ్చింది. సోమవారం మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. తన కుమార్తె మృతికి అల్లుడే కారణమని మృతురాలి తల్లి దేవక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మనస్తాపంతో ఒకరు..

**దండేపల్లి:** ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన పూసాల రాజు (36) ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్య రాజేశ్వరితో గొడవపడటంతో రెండు రోజుల క్రితం ఇద్దరు పిల్లలతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన రాజు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం చిట్టీడబ్బుల కోసం వెళ్లిన వ్యక్తి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్

# దాడి కేసులో నలుగురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

**జైపూర్:** మండలంలోని వేలాలలో జరిగిన దాడి కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. గ్రామంలో ప్యాగ రాజ సమ్మయ్య, అతని సోదరులకు 33 గుంటల భూమి ఉంది. ఆ భూమి విషయంలో అన్న మైసయ్య, అతని కుమారులు సమ్మయ్య, నగేష్, మల్లేశ్‌తో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. అందులో ఇటీవల మైసయ్య ఇల్లు నిర్మాణం చేపట్టగా రాజ సమ్మయ్య కుమారులు శ్రీనివాస్, సంతోష్, భార్య మల్లక్క భూమి వద్దకు వెళ్లి భూమిని పంచుకున్న తర్వాత ఇల్లు కట్టుకొమ్మన్నారు. ఈ విషయంలో సమ్మయ్య, నగేష్, మల్లేశ్, లక్ష్మి వారిపై దాడికి పాల్పడ్డారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

## అద్దె కారు తిరిగివ్వని ఇద్దరు..



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సునీల్ కుమార్

**ఆదిలాబాద్‌టౌన్:** కారు అద్దెకు తీసుకొని తిరిగి ఇవ్వని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. 2025 మార్చి 28న సునార్ గల్లికి చెందిన అన్నదమ్ములు ముమ్మడివార్ రాకేష్, ముమ్మడివార్ కృష్ణ హైదరాబాద్‌కు వెళ్తామని చెప్పి రవీంద్రనగర్‌కు చెందిన బొడ్గం రాజేశ్ వద్ద కారు అద్దెకు తీసుకున్నారు. ఇప్పటి వరకూ తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

### బాసర ఆలయ హుండీ లెక్కింపు

**బాసర:** బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ హుండీని మంగళవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనాదేవి తెలిపారు. 83 రోజులకు రూ.81,69,099 నగదు, 91 గ్రాముల 500 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, మూడు కిలోల 500 గ్రాముల మిశ్రమ వెండి, 79 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్, ఏఈవో సుదర్శన్ పర్యవేక్షకులు శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

### 108 ఈఎంటీకి ఉత్తమ సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గణేశ్

**ఉట్నూర్‌రూరల్:** రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 108 సిబ్బందికి రాష్ట్ర ఎంఆర్ఐ సంస్థ అందించే ఉత్తమ సేవా పురస్కారానికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ 108లో మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న గణేశ్ ఎంపికయ్యారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్, జిల్లా ఇన్‌చార్జి రాజశేఖర్, పైలట్ సుందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం.. వాట్సాప్ చానల్

- అధికారిక చానల్ ప్రారంభించిన వ్యవసాయ శాఖ
- అన్నదాతకు సలహాలు, సూచనలు




వ్యవసాయ శాఖ వాట్సాప్ చానల్

**లక్ష్మణచాంద:** పంటల సాగులో తరచూ ఎదురయ్యే తెగుళ్లు, వాటి నివారణకు సరైన మందుల ఎంపికలో అవగాహన లోపం కారణంగా రైతులు దిగుబడులు కోల్పోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సాంకేతికత ఆధారంగా రైతుల ముంగిట ముఖ్య సమాచారాన్ని అందించేందుకుకు ఈ ఏడాది ఆగస్టు 8న ప్రత్యేక అధికారిక వాట్సాప్‌చానల్‌ను ప్రారంభించింది.

**చానల్ ద్వారా లభించే ప్రయోజనాలు**

- తెగుళ్ల గుర్తింపు, నివారణకు సరైన సలహాలు
- రోగ నిరోధక వంగడాలు, గుణాత్మక విత్తనాల ఎంపికలో మార్గదర్శకత్వం
- పంటల రక్షణ, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణపై సూచనలు
- వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాల వివరాలు
- రాయితీ విత్తనాల లభ్యత, మౌలిక వసతులపై తాజా సమాచారం

**నిపుణుల సలహాలు**

రైతు సాగు చేసే పంటకు మొలక దశ నుంచి కోత దశ వరకు ఏ తెగులు వచ్చినా, దాని ఫొటోను చానల్‌లో పోస్టు చేస్తే వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆ తెగుళ్లను వెంటనే గుర్తిస్తారు. తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ మందులు, ఏ మోతాదులో ఉపయోగించాలో వివరిస్తారు.

**చానల్‌లో చేరడం ఇలా..**

- రైతులు తమ క్లస్టర్ పరిధిలోని అసిస్టెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ (ఏఈవో)ను సంప్రదించాలి.
- మొబైల్ నంబర్ అందిస్తే వారు చానల్‌లో చేర్చుతారు.

**గ్రామస్థాయి అవగాహన కార్యక్రమాలు**

- రైతు వేదికల ద్వారా ఇప్పటికే సమాచార కల్పన ప్రారంభమైంది
- త్వరలో ప్రతీ గ్రామంలో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన పెంపు
- అన్నదాతలు చానల్‌లో చేరేలా చర్యలు

### రైతులకు మేలు



తెలంగాణ వ్యవసాయ శాఖ రూపొందించిన వాట్సాప్ చానల్ అన్నదాతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. సాగు ఖర్చులు తగ్గడంతో పాటు మంచి దిగుబడులు కూడా పొందవచ్చు. ఈ చానల్‌లో జిల్లాలోని రైతులంతా చేరాలని కోరుతున్నాం.

– అంజిప్రసాద్, డీఏవో, నిర్మల్

# 33వ రోజుకు కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు

**ఉట్నూర్‌రూరల్:** తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరుకుంది. మంగళవారం గిరిజన సంఘాలు, వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు మాట్లాడుతూ సమ్మె చేపట్టి 33 రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావు, కుంర రాజు, భీంరావు, సంజయ్, విజయ్, బీఆర్ఎస్ నాయకులు కొమ్ము విజయ్, కాటం రమేశ్, ధరణి రాజేశ్, బాజీరావు, దావుల రమేశ్ ఉన్నారు.

# ఐటీఐ గేటుకు తాళం వేసి నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

**మంచిర్యాలఅర్బన్:** 2022–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన కోర్సు ఫీజు చెల్లించినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో మంగళవారం డీంపి ఐటీఐ గేటుకు తాళం వేసి విద్యార్థులు నిరసన తెలిపారు. కళాశాల చైర్మన్ వచ్చారన్న సమాచారంతో వెళ్లి సర్టిఫికెట్లు అడిగితే దాటవేత సమాధానం ఇవ్వడంతో గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, జేవీఎస్ విద్యార్థి సంఘాల నేతలు శ్రీకాంత్, వంశీ వారికి మద్దతు తెలిపారు. ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కళాశాల యజమానులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా విద్యార్థులు, విద్యార్థిసంఘాల నేతలు కూడా అక్కడికి వెళ్లారు. కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ మధ్య డబ్బుల వివాదంతో సర్టిఫికెట్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాత్రి వరకు సర్టిఫికెట్ల సమస్య పరిష్కారంపై కొలిక్కిరాలేదు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకుని సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.